# ‘ధార్మిక, హిందూ మత సంస్థల, ధర్మాదాయ సవరణ బిల్లు- 2025’కు ఏకగ్రీవ ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ‘‘తెలంగాణ ధార్మిక, హిందూ మత సంస్థల, ధర్మాదాయముల సవరణ బిల్లు 2025’’ శాసనసభ మంగళవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ బిల్లును దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రవేశపెట్టగా, బిఆర్ఎస్, ఎంఐఎం, సిపిఐ సంపూర్ణమద్దతు ప్రకటించాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) తరహా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి దేవస్థాన నిర్వహణకు, భక్తులకు మరింత సేవలను అందించేందుకు గాను 18 మందితో పాలక మండలిని, అలాగే హిందూ ధర్మప్రచార పరిషత్‌ను కూడా ఏర్పాటు చేసి,ఒక కోటీ రూపాయలను కేటాయించనున్నట్టు బిల్లులో ప్రతిపాదించారు. రూ. 25లక్షల నుంచి కోటీ రూపాయాల ఆదాయం, రూ.1 కోటీ నుంచి రూ. 100 కోట్లు ఆదాయం, రూ.100కోట్ల ఆదాయం మించిన దేవాలయాలను వేర్వురుగా విభజిస్తూ దేవాదాయ సవరణ బిల్లులో ప్రతిపాదించారు.

అంతకుముందు మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో చిన్న దేవాలయాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల్లో సౌకర్యాలను కల్పించడంతో పాటు ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం కారణంగా దేవాలయాల్లో భక్తుల సంఖ్య పెరిగిందని, తద్వారా ఆదాయం కూడా పెరిగిందన్నారు. యాదగిరిగుట్ట దేవాలయంలో పలు సౌకర్యాలను కల్పించామని, తద్వారా ప్రస్తుత ఏడాదిలో రూ.200 కోట్లకుపైగా ఆదాయం వచ్చిందని వివరించారు. యాదగిరిగుట్ట లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానానికి పాలకమండలిని ఏర్పాటు చేస్తే, మరింత అభివృద్ధి జరుగుతుందని, యాదగిరిగుట్టలో వేద పాఠశాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ దేవాలయ పరిధిలోని వెయ్యి కిలోమీటర్ల వరకు రెండు అంతస్తులకుపైన ఉన్న భవనాలకు అనుమతి ఇవ్వకూడదని గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, తద్వారా అభివృద్ధి జరగడం లేదని తెలిపారు. ఈ విషయంలో మరోసారి చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో యాదగిరిగుట్ట అభివృద్ధి పేరుతో ఆలయాల ప్రాంగణంలో ఉన్న షాపులను, ఆటో కార్మికుల ఉపాధిపై దెబ్బకొట్టారని, కనీసం వాహనాల పార్కింగ్ లేదని ఆరోపించారు.

బిఆర్ఎస్ సభ్యులు తన్నీరు హరీశ్ రావు మాట్లాడుతూ వేములవాడ దేవాలయానికి కూడా పాలకమండలిని ఏర్పాటు చేయాలన్నారు. యాదగిరిగుట్ట దేవాయల పునఃనిర్మాణానికి రూ.2వేల కోట్లను గత ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవాలయానికి పాలకమండలి ఏర్పాటు చేసే నిర్ణయాన్ని స్వాగతించారు. యాదగిరిగుట్ట ఆలయ పునఃనిర్మాణానికి రోడ్డు భవనాల శాఖ మంత్రిగా తాను ఎంతో కృషి చేశానన్నారు.

బిజెపి సభ్యులు పాల్వాయి హరీశ్ బాబు మాట్లాడుతూ ఆదివాసి, దళిత గ్రామాల్లో శ్రీలక్ష్మి నరసింహ స్వామి కళ్యాణం నిర్వహించాలని, బాసర దేవాలయ అభివృద్ధికి నిధులను మంజూరుచేయాలని కోరారు.

ఎంఐఎం సభ్యులు కౌసర్ మొయినుద్దీన్ మాట్లాడుతూ శ్రీలక్ష్మి నరసింహ స్వామి దేవాలయ అభివృద్ధికి నిజాం యువరాణి రూ.8లక్షల నగదు, విలువైన బంగారు ఆభరణాలను కానుకగా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ యాదగిరిగుట్ట దేవాలయ ప్రారంభోత్సవ సమయంలో తాను ఎంఎల్‌ఎగా ఉన్నప్పటికీ తనను ఆహ్వానించలేదని గుర్తు చేశారు.

**‘‘భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం’పై ప్రత్యేక దృష్టి పెట్టండి : కూనంనేని సాంబశివరావు**

సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ దక్షిణాది అయోధ్యగా ప్రసిద్ధిగాంచినభద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవాలయంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కోరారు. శ్రీరాముల ఆలయానికి రూ.100 కోట్ల నిధులను కేటాయిస్తామని గత సిఎం కెసిఆర్ హామీనిచ్చినప్పటికీ, నిధులను మాత్రం కేటాయించలేదని ఆయన చెప్పారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవస్థానం తరహాలోనే అత్యంత పురాతనమైన భద్రాచలం శ్రీరాముని ఆలయం అభివృద్ధికి కృషి చేయాలని, తద్వారా ఆలయానికి అదనపు ఆదాయం కూడా పెరుగుతుందని కూనంనేని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. దేవాలయాలను పర్యాటక ప్రాంతాలకు అనుసంధానం చేయాలని, తద్వారా ఆదాయం పెరుగుతుందన్నారు. రూ.25లక్షల ఆదాయం వస్తున్న పెద్దమ్మ దేవాలయం లాంటి ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. దేవాలయాన్ని అభివృద్ధి చేసే క్రమంలో ఆ దేవాలయంపైన ఆధారపడి జీవిస్తున్న వారి ఉపాధిని దెబ్బతియకుండా ప్రణాళికలను రూపొందించుకోవాలని కూనంనేని సూచించారు.



# సురవరం ప్రతాపరెడ్డి పురస్కారాన్ని ప్రకటించాలి

ప్రభుత్వానికి సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలుగు సాహిత్య రంగంలో భావితరాలకు స్ఫూర్తిని ఇచ్చే విధంగా తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ సుప్రసిద్ధ రచయిత, వైతాళికుడు ‘‘సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం’’గా నామకరణం చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, శాసనసభలో రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇచ్చిన ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్, తెలంగాణ సారస్వత పరిషత్, సురవరం కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య కృషిని గుర్తించాలనే ప్రజలందరి ఆకాంక్షలను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గుర్తించి గౌరవించినందుకు ట్రస్ట్ అభినందనలు తెలియజేసింది. ప్రతి ఏడాది మే నెల 28వ తేదీన సురవరం ప్రతాప రెడ్డి జయంతిని ప్రభుత్వం రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని, దాశరథి పేరుతో పురస్కారాన్ని అందజేస్తున్న మాదిరిగానే ‘సురవరం ప్రతాపరెడ్డి పురస్కారాన్ని’ కూడా ఇవ్వాలని ప్రభుత్వానికి ట్రస్ట్ విజ్ఞప్తి చేసింది. తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరును పెట్టడం తెలంగాణ, తెలుగు భాష ఏకోన్ముకంగా మరింతగా వైభవోపేతం కావడానికి దోహదపడుతుందని ట్రస్ట్ పేర్కొన్నది. ఈ మేరకు హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, సంయుక్త కార్యదర్శి జె.చెన్న య్య, ట్రస్టీలు సురవరం పుష్పలత, డాక్టర్ కృష్ణవర్ధన్ రెడ్డి, డాక్టర్ కొండా లక్ష్మీ కాంత రెడ్డి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ట్రస్ట్ సభ్యులు, ప్రతాపరెడ్డి మనుమలు సురవరం అనిల్‌రెడ్డి, సురవరం కపిల్, సుధీర్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం తెలుగు సాహిత్య, జర్నలిజం రంగాలలో విశేష సేవలు అందిస్తున్న వారికి అందజేస్తున్న ఒక అవార్డుతో పాటు ఈ రంగాలలో అధ్యయనం చేస్తున్న ప్రతిభావంతులకు ఒక స్కాలర్‌షిప్‌ను ‘‘సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం’’ తరపున ఇవ్వాలని ట్రస్ట్ భావిస్తున్నదని, దీనిపై ట్రస్ట్ కమిటీ త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ కోరిక మేరకు సురవరం ప్రతాప రెడ్డి జీవితం, సాహిత్య కృషిపై ‘సురవరం ప్రతాప రెడ్డి వాచకం’’ పుస్తకాన్ని తాను రచించానని, అది ప్రచురణ కావాలి ఉందని వెల్లడించారు. పుష్పలత మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడలేని పరిస్థితుల్లో తెలుగు జాతిని మేలుకొల్పేందుకు, తెలుగు సాహిత్య వికాసానికి సురవరం ప్రతాప రెడ్డి ఎనలేని కృషి చేశారన్నారు. డాక్టర్ కృష్ణవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప రెడ్డి పేరు పెట్టడానికి కృషి చేసిన కమ్యూనిస్టు నేత సురవరం సుధాకర్ రెడ్డి, సిపిఐ ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావులకు, సహకరించిన ఎంఎల్‌ఎలందరికీ ట్రస్ట్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ కొండా లక్ష్మీ కాంత రెడ్డి మాట్లాడుతూ తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప రెడ్డి పేరు పెట్టాలనే ప్రతిపాదన దశాబ్ధకాలంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అది సాకారం కావడం హర్షణీయమన్నారు. కె.విరాహత్ అలీ మాట్లాడుతూ తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడం ఒక వ్యక్తికి కాకుండా తెలుగు సాహిత్య రంగానికి, తెలుగు జర్నలిజానికి, యావత్ సమాజానికి దక్కిన గౌరవమని, తద్వారా తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తమౌతుందన్నారు. అనేక మహోన్నతమైన సాంఘీక గ్రంధాలే మహనీయుడు ప్రతాప రెడ్డి సమాజానికి అందించిన విశేషమైన సేవలకు నిదర్శనమన్నారు. జె.చెన్నయ్య మాట్లాడుతూ చీకటిలో మగ్గుతున్న తెలుగు ప్రజల స్వాభిమాన ప్రతీకగా ప్రతాప రెడ్డి నిలిచారని, తెలుగు యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టడం ద్వారా తెలుగు సాహిత్య రంగానికి స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని పేర్కొన్నారు.

## మాజీ కేంద్ర హోంమంత్రి, సిపిఐ దిగ్గజం ఇంద్రజిత్తు గుప్తకు నివాళి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ కేంద్ర హోం మంత్రి, సిపిఐ అగ్ర నాయకులు ఇంద్రజిత్తు గుప్తకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఇంద్రజిత్తు గుప్త జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాదులోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం, మగ్ధూం భవన్‌లో ఆయన చిత్ర పటానికి కూనంనేని సాంబశివరావు పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంద్రజిత్తు గుప్త దేశానికి, పార్టీకి చేసిన సేవలను కూనంనేని సాంబశివరావు గుర్తు చేశారు ఆఫీస్ కార్యదర్శి గోవిందరావు, అంజయ్య, సురేష్ కృష్ణ, హరీష్, సందీప్ తదితరులు ఇంద్రజిత్తు గుప్తకు నివాళ్లు అర్పించారు.

## ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంక్షలు అప్రజాస్వామికం

మారుపాక అనిల్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉద్యమాలను నిషేదిస్తూ జారీచేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థి ఉద్యమాలు, ఆందోళనలను నిషేధించడమంటే ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకలను నులిమేయడం అత్యంత దౌర్భాగ్యమని, నిరంకుశ పోకడలను మానుకోవాలన్నారు. పోరాటాల పురిటిగడ్డ, తెలంగాణ ఉద్యమానికి గుండెకాయలాంటి ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలు విధించడం అప్రజాస్వామికమని, నిరసన తెలిపే హక్కును హరిస్తూ ఆంక్షలు విధించడం అమానుషమని ప్రకటనలో మండిపడ్డారు. 'ఇది పూర్తి రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా ఆయన అభివర్ణించారు. ఓయూలో విద్యార్థుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. నిరసన హక్కు ప్రతి పౌరుడికి ఉన్న ప్రాథమిక హక్కు అనే సంగతి యూనివర్సిటీ విసి మరిచారని ఆయన దుయ్యబట్టారు. విద్యార్థులను అణచివేయడం మాని.. వారి సమస్యలు తెలు సుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ తుంగలో తొక్కాలనే కుట్ర జరుగుతోందని, తక్షణం ఆంక్షల ఉత్తర్వులను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## కెటిఆర్... నీ ఫామ్‌హౌజ్ లీలలు బయటపెడతాం

టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీమంత్రి కెటిఆర్ అధికారమదంతో జన్వాడ ఫామ్ హౌజ్‌లో నడిపించిన అక్రమ వ్యవహారాలన్ని త్వరలోనే ప్రజల ముందు బయటపెడతామని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ హెచ్చరించారు. కెటిఆర్ శని, ఆదివారాల్లో ఫాంహౌజ్‌లో విచ్చలవిడిగా సాగించిన లీలలు, ప్రైవేట్ జెట్ విమానాల్లో చేసిన విహార యాత్రల వివరాలన్ని త్వరలోనే వెల్లడిస్తామన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మంచి పేరు తెచ్చుకోవడాన్ని జీర్ణించుకోలేని కెటిఆర్ బ్లాక్ మెయిలింగ్ వ్యాఖ్యలు చేస్తున్నారని, కెటిఆర్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అధికారం కోల్పోయిన కెటిఆర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారంలో ఉన్నపుడు కెటిఆర్ చేసిన అవినీతి వ్యవహారాలతో విసిగిపోయిన ప్రజలు బిఆర్‌ఎస్‌ను శంకరగిరి మాన్యాలు పట్టించారని, అయినా ఇంకా బుద్ధి తెచ్చుకోవడం లేదన్నారు. కేంద్రంలో బిజెపి కూడా కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తూ కాలం వెల్లదీస్తున్నదన్నారు. తెలంగాణలో కూడా కెటిఆర్ ఒక వాట్సప్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకొని నిత్యం అసత్యాలను ప్రచారం చేస్తున్నారని బండి సుధాకర్ విమర్శించారు. కెటిఆర్ చేసిన తప్పులను కప్పి పుచ్చుకోవడానికి తప్పుడు ప్రచారాలతో రాజకీయాలు చేస్తున్నాడన్నారు. కెటిఆర్‌కు త్వరలోనే గుణపాఠం తప్పదని బండి సుధాకర్ హెచ్చరించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన కెటిఆర్ బుద్ధి తెచ్చుకొని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## యాజమాన్యం ఉద్దేశపూర్వకంగానే హాజరుకావడం లేదు

టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి విమర్శ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్మిక శాఖ కమిషనర్ ఏర్పాటు చేసిన సమావేశానికి ఆర్‌టిసి యజమాన్యం ఉద్దేశపూర్వకంగానే హాజరుకావడం లేదని టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి విమర్శించింది. హైదరాబాద్ అజామాబాద్ పారిశ్రామిక వాడలోని ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం జెఎసి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ సమావేశంలో జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, కో ఛైర్మన్ కె.హనుమంత్ ముదిరాజ్, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎం.డి. మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరిలు మాట్లాడుతూ కార్మిక శాఖ కమిషనర్ ఏర్పాటు చేసిన సమావేశానికి ఆర్‌టిసి యజమాన్యం కావాలని గైర్హాజరై సమస్యలు పరిష్కరించడానికి మొఖం చాటేస్తున్నారని విమర్శించారు. ఈనెల



17 కార్మిక శాఖ కమిషనర్ సమావేశానికి ఎందుకు గైర్హాజర్ అయ్యారో కారణాన్ని రాతపూర్వంగా కార్మిక శాఖ కమిషనర్ వివరణ కోరాలన్నారు. ఆర్‌టిసి యజమాన్యం సామరస్యంగా సమస్యలు పరిష్కరించేందుకు ఇష్టపడటం లేదన్నారు. వారి అహంకారపూరితమైన ధోరణితో కార్మిక సంఘాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తూ ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇస్తున్నారని విమర్శించారు. ఈనెల 21వ తేదీ మరోసారి కార్మిక శాఖ కమిషనర్ సమావేశానికి పిలుస్తామని చెప్పారన్నారు. ఇదే ఆఖరి సమావేశం కావాలని, ఈ సమావేశానికి యజమాన్యం హాజరు కానియెడల తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె తేదీని ప్రకటిస్తామని నాయకులు హెచ్చరించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలలో ఆర్‌టిసి కార్మిక సమస్యలను చర్చించాలని, సమ్మె లేఖలో పొందుపరచిన డిమాండ్‌లలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అందుకనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలుకు రూ. 2000 కోట్లు, 2017 వేతన సవరణ అలవెన్సులతో పాటు ఎరియర్స్ చెల్లింపు, 2021 వేతన సవరణతో పాటు రిటైరైన కార్మికుల బకాయిలు, సిసిఎస్, పిఎఫ్, ఎస్.ఆర్.బి. ఎస్, ఎస్.బి.టిలకు ఇవ్వాల్సిన 3,200 కోట్లు, మహాలక్ష్మి పథకం కింద రూ. 5000 కోట్లు కలిపి మొత్తం 10,200 కోట్లను బడ్జెట్‌లో కేటాయించి, ఏకకాలంలో ఆర్‌టిసికి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్.బాబు, బి.యాదయ్య, పి.అప్పారావు, ప్రేమ్‌నాథ్, కె.ఎస్. పాల్, జి.రాములు, బి.శ్రీనివాస్, కె.రామిరెడ్డి పాల్గొన్నారు.

## 15 మంది డిఎస్‌పిలకు అదనపు ఎస్‌పిలుగా పదోన్నతులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న 15 మంది డిఎస్‌పిలను అదనపు ఎస్‌పిలుగా పదోన్నతులు కల్పిస్తూ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్త మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులతో పాటు వారికి పోస్టింగ్‌లు కూడా ఇచ్చారు. పదోన్నతులు పొందిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. రాచకొండ షీ టీం ఎసిపి టిఎంఎన్ బాబ్జీ, విజిలెన్స్ డిఎస్‌పి కె.శ్రీకాంత్, నిజామాబాద్ ఎస్‌బి ఎసిపి ఎస్.శ్రీనివాస్‌రావు, మహేశ్వరం ట్రాఫిక్ ఎసిపి సి.కుషాల్‌కర్, కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఎసిపి జి.నరేందర్, ఎస్‌ఆర్‌నగర్ ఎసిపి పి.వెకటంరమణ, సైబరాబాద్ సిసిఎస్ ఎసిపి ఎస్.చంద్రకాంత్, కాచిగూడ ఎసిపి వి.రఘు, సచివాలయం సెక్యూరిటీ ఎసిపి కె.పూర్ణచందర్, బాలనగర్ ఎసిపి జి.హనుమంత్ రావు, శంషాబాద్ ఎసిపి కె.శ్రీనివాస్‌రావు, నల్గొండ ఎస్‌బి డిఎస్‌పి జి.రమేష్, జిహెచ్‌ఎంసి డిఎస్‌పి ఎం.సుదర్శన్, ఎసిబి డిఎస్‌పి ఎన్.ఉదయ్‌రెడ్డి, సిఐడి డిఎస్‌పి ఎన్.శ్యామ్ ప్రసాదరావులు అదనపు ఎస్‌పిలుగా పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు. వీరందర్ని బదిలీ చేస్తూ డిజిపి కార్యాలయంలో రిపోర్టు చేయమని ఉత్తర్వులు జారీ చేశారు.

## టిజిపిఎస్‌సి పూర్తి స్థాయి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



ఎఐవైఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి టిజిపిఎస్‌సి పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర అన్నారు. తక్షణమే పూర్తిస్థాయి జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయాల కోరుతూ టిజిపిఎస్‌సి ఛైర్మన్‌కు బుర్రా వెంకటేశం వినతి పత్రం సమర్పించేందుకు వెళ్లిన ఎఐవైఎఫ్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఎఐవైఎఫ్ నాయకులు అక్కడే నిరసనకు దిగడంతో పోలీసులు చివరికి వినతి పత్రం సమర్పించేందుకు అనుమతినిచ్చారు. అనంతరం ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులునెర్లక్కంటి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ శాఖల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలను జాబ్ క్యాలెండర్ రూపంలో విడుదల చేసినప్పటికీ వాటిని భర్తీ చేయడంలో మాత్రం అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు సెప్టెంబర్ 2024, ట్రాన్స్ కో, జెన్కో ఉద్యోగాలు అక్టోబర్ 2024, గెజిటెడ్ క్యాటగిరి ఇంజనీరింగ్ సర్వీసెస్ అక్టోబర్ 2024, ఫారెస్ట్ ఆఫీసర్స్ అక్టోబర్ 2024 ,గెజిటెడ్ స్కేల్ అదర్ సర్వీసెస్ జనవరి 2025, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ ఫిబ్రవరి 2025, ఎస్‌ఐ, కానిస్టేబుల్స్ భర్తీకి సంబంధించి జ్యాబ్ క్యాలెండర్ విడుదల చేశారని కాని నేటి వరకు కూడ పరీక్షలు నిర్వహించలేదన్నారు. టిజిపిఎస్‌సి ఇచ్చిన జాబ్ క్యాలెండర్ ప్రకారం తక్షణమే నోటిఫికేషన్ వివరాలను ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా గత ప్రభుత్వం అనుసరించిన అప్రజస్వామిక పోకడలను అనుసరించొద్దని,ఆంక్షలతో ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్. బాలక్రిష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, కార్యవర్గ సభ్యులు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, వంశి, విజయ్ పాల్గొన్నారు.

## టఫే వైస్ చైర్మన్‌గా డాక్టర్ లక్ష్మి వేణు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రముఖ ట్రాక్టర్ తయారీదారు ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ (టఫే) వైస్ ఛైర్మన్‌గా డాక్టర్ లక్ష్మి వేణు నియమితులయ్యారు. డాక్టర్ లక్ష్మి చేసిన గణనీయమైన కృషికి గుర్తింపుగా, 2023లో బిజినెస్ టుడే ప్రచురించిన ‘మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్’ జాబితాలో ఆమె స్థానం సంపాదించారు. అదనంగా, ఆమె ఎకనామిక్ టైమ్స్ ‘యంగ్ లీడర్స్ 40 అండర్ 40’ గుర్తింపును కూడా అందుకున్నారు. ప్రస్తుతం, ఆమె ప్రముఖ ఆటోమోటివ్ భాగాల తయారీ సంస్థ సుందరం క్లేటన్ లిమిటెడ్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారు. డాక్టర్ లక్ష్మి యేల్ యూనివర్సిటీలో పట్టభద్రురాలిగా, అలాగే యుకెలోని యూనివర్సిటీ ఆఫ్ వార్విక్ నుండి ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్‌ను పొందారు. ఈ సందర్భంగా టఫే ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లికా శ్రీనివాసన్ మాట్లాడుతూ టఫే డైరెక్టర్‌గా ఉన్న ఆమె వ్యవసాయ యాంత్రీకరణ, ఆటోమొబైల్ భాగాల వ్యాపారంలో ఆమె సాధించిన విజయాలకు ప్రసిద్ధి చెందారన్నారు.
డాక్టర్ లక్ష్మి వేణు వ్యూహాత్మక ఆలోచన, కస్టమర్ కేంద్రీకృత విధానం బలమైన నాణ్యత ధోరణితో టఫేను ముందుకు తీసుకెళుతున్నారన్నారు. టఫే డైరెక్టర్ పి.బి. సంపత్ మాట్లాడుతూ ట్రాక్టర్ ఆటో కంపోనెంట్ పరిశ్రమలో విశేష అనుభవం, ఉన్నత విద్యా నేపథ్యం కలిగిన డాక్టర్ లక్ష్మి , వ్యాపార దృష్టి, అనుభవం విలువల అద్భుతమైన సమ్మేళనం కలిగిన గొప్ప నాయకురాలు అన్నారు.

## బెట్టింగ్ ప్రమోషన్స్‌పై ఇడి ఫోకస్..

**ప్రజాపక్షం/హైదరాబాద్ :**తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్స్ యాప్స్ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. నిబంధనలు తుంగలో తొక్కి సంపాదనే లక్ష్యంగా.. యువతను చెడు దారి పట్టించేలా బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన అందరిపైనా పోలీసులు ఫోకస్ పెట్టారు. ఇప్పటికే దాదాపు 11 మందికి పైగా కేసులు నమోదు చేశారు. తాజాగా.. ఈ బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలోకి డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) ఎంట్రీ ఇచ్చింది. బెట్టింగ్ యాప్స్ ప్రచారం చేసిన యూట్యూబర్ల వివరాలపై ఇడి ఆరా తీసింది. చెల్లింపుల వ్యవహారంపై ఫోకస్ పెట్టింది. ఇప్పటికే పోలీసులు నమోదు చేసిన కేసు వివరాలను తెప్పించుకున్నది. మనీ లాండరింగ్, హవాలా రూపంలో చెల్లింపులు జరిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తోంది. మరోవైపు.. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసే వారికి హైదరాబాద్ వెస్ట్ జోన్ డిసిపి విజయ్ కుమార్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికే కేసు నమోదైన 11 మంది ఇన్ ఫ్లుయన్సర్స్ కారణంగా ఎవరైనా బెట్టింగ్‌లో పెట్టి, వారు ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్యకు పాల్పడినట్లు మా దర్యాప్తులో ఆధారాలు దొరికితే వారిపై కచ్చితంగా పదేళ్ల జైలు శిక్ష ఖాయమని స్పష్టం చేశారు. చట్టపరంగా ఎవర్నీ వదిలిపెట్టేది లేదని ఆయన హెచ్చరించారు. యువతను ఆర్థికంగా నిండా మునిగేలా చేయడం సహించరాని నేరమన్నారు.



# బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం హర్షణీయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును రాష్ట్ర శాసన సభ ఆమోదించడం పట్ల అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీసుకువచ్చిన బిసి రిజర్వేషన్ బిల్లు దేశానికే ఆదర్శమన్నారు. బడుగు బల హీన వర్గాల సంక్షేమం, అభ్యున్నతి కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు బిసి రిజర్వేషన్ బిల్లు ఒక నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ‘జనాభాలో బిసిలు ఎంత శాతమో అధికారంలో అంత భాగం’ అనే కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ఆశయానికి అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో చర్యలు చేపట్టారన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర ఇంటింటి కులగణన సర్వేను (విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ) చేపట్టిందని, ఈ సర్వే లెక్కల



ఆధారంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించి బిసి రిజర్వేషన్ బిల్లును తీసుకురావడాన్ని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం స్వాగతిస్తుందన్నారు. బిల్లు రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేందుకు మద్దతు ఇచ్చిన సిపిఐ, బిఆర్‌ఎస్, బిజెపి, ఎంఐఎం పార్టీలకు గుంజ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

## మండే ఎండల్లో వాతావరణ శాఖ చల్లని వార్త

రాష్ట్రంలో ఐదు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రోజు రోజుకు ఎండలు మండుతున్నాయి. ఉదయం 10 గంటల తర్వాత బయటకు వెళ్లాలంటే జనం ఆలోచించాల్సిన పరిస్థితి వచ్చేసింది. మధ్యాహ్నం వేళ రోడ్లపై జనం పెద్దగా కనిపించట్లేదు. ఇక రాత్రి వేళ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. తీవ్రమైన ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వాతావరణ శాఖ అధికారులు చల్లటి వార్త చెప్పారు. దీంతో ఎండల ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించనుంది. ఈ నెలలో 5 రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. తెలంగాణలో ఈనెల 21వ తేదీ నుంచి వానలు కురుస్తాయని వెల్లడించారు. మార్చి 21 నుంచి 25 వరకు మొత్తం ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. తేలికపాటి, ఓ మోస్తరుగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మూడు రోజులపాటు ఉదయం వేళ పొగ మంచు ఏర్పడే అవకాశం ఉందన్నారు. క్రమంగా ఉష్ణోగ్రతలు కాస్త తగ్గవచ్చనే అంచనా ఉందన్నారు. అయితే బుధ, గురువారాల్లో పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. 2024 వేసవితో పోల్చితే ఈ సారి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయన్నారు.

**డాక్యుమెంట్లు పోయినవి**

ఇందుమూలంగా తెలియ జేయునది ఏమనగా! శ్రీమతి **దోకూరు గీత, భర్త: ప్రభాకర్‌రెడ్డి,** R/O. ప్లాట్ నెం. 367, శ్రీనివాసపురం కాలనీ, వనస్థలిపురం, రంగారెడ్డి జిల్లా. నేను ఫిబ్రవరి 12వ తారీకున కొత్తపేట నుండి ఆర్‌టిసి సిటీ బస్సులో ప్రయాణం చేస్తుండగా ఎల్‌బినగర్ దగ్గర నా వద్దనున్న **ప్లాట్ మరియు భూమి డాక్యుమెంట్లుగల బ్యాగ్ పోయినది.** అట్టి బ్యాక్ డాక్యుమెంట్లు: **1)** Doc 2398/1996, **2)** Doc 7252/2006, **3)** Doc 4974/2012, **4)** Doc 7511/2008, **5)** Doc 5921/2009, **6)** Doc 10258/2016, **7)** Doc 3861/2012, **8)** Doc 10042/2008 సబ్ రిజిస్ట్రార్ సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా డాక్యుమెంట్లు మిస్ కావడం జరిగింది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది నంబర్‌కు తెలియజేయగలరు.

ఇట్లు

**దోకూరు గీత, భర్త: ప్రభాకర్‌రెడ్డి**
**సెల్: 8328193586**

# మహానగరి

## భూములు కోల్పోతున్న రైతుకు పరిహారం ఇచ్చేందుకు చర్యలు : ఆర్‌డిఒ సరిత

ప్రజాపక్షం/కొత్తూరు: పెంజర్ల గ్రామంలోని సర్వే నంబర్ 389లో భూసేకరణలో భూమి కోల్పోతున్న రైతులకు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని షాద్‌నగర్ ఆర్‌డిఓ సరిత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెంజర్ల గ్రామ పంచాయతీ వద్ద జరిగిన గ్రామసభలో ఆర్‌డిఓ సరిత మాట్లాడుతూ భూమి కోల్పోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కొత్తూరు తహసీల్దార్ రవీందర్ రెడ్డి, నాయబ్ తహసీల్దార్ జంగయ్య, ఆర్‌ఐ సంజీవ పాల్గొన్నారు.

## షాద్‌నగర్ ఆర్‌టిసి డిపోకు 18 బస్సులు

ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రయాణికుల ఇబ్బందులను దూరం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. షాద్‌నగర్ ఆర్‌టిసి డిపోకు గతంలో 18బస్సులను తీసుకువచ్చామని, ప్రస్తుతం మరో 18 బస్సులను తీసుకువస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులకు లేకుండా రవాణా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పాఠశాలల సమయవేళలను పాటిస్తూ ఆర్‌టిసి బస్సులను నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, డ్రైవర్, కండక్టర్ల సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

## క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే భవిష్యత్తు




ప్రజాపక్షం/షాద్‌నగర్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులను అభినంధించారు. ఈ సందర్భంగా విశాల మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. పదవ తరగతి విద్యార్థి దశకు కీలకమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధాయులు శేఖర్‌తో పాటు ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## భూములు ఇవ్వడానికి సిద్ధంగాలేం

ఆర్‌డిఒకు మొండిగౌరెల్లి గ్రామ రైతులు వినతి



ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని మొండి గౌరెల్లి గ్రామానికి చెందిన పేదల భూములు ప్రభుత్వం తీసుకోవడాన్ని నిరసిస్తూ మంగళవారం మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన రైతులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆర్‌డిఒ కార్యాలయం, ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒకు, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మొండి గౌరెల్లి గ్రామంలో 100 మంది రైతులు భూమిని ఇవ్వడానికి సిద్ధంగా లేరన్నారు. కార్యక్రమంలో నాయకులు మరిపల్లి అంజయ్య యాదవ్, బండి మీది కృష్ణ, తాండ్ర రవిందర్, యాదగిరి రెడ్డి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు




ప్రజాపక్షం/గండిపేట్: మణికొండ మున్సిపాలిటీ మణికొండ జిల్లా పరిషత్ హై స్కూల్ లో పదవ తరగతి 2024–2025 సంవత్సరం టెన్త్ క్లాస్ బ్యాచ్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. సమావేశానికి మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్‌నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రామకృష్ణా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు తాము ఎల్లవేళలా ఆర్థికంగా ఇబ్బందులు ఉంటే తమ వంతు సహాయం చేయడానికి ముందుంటామన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని మణికొండ మున్సిపాలిటీ పేరు రాష్ట్ర స్థాయిలో నిలపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ హెడ్మాస్టర్ నిరంజన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాలల నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమార్, మాజీ కౌన్సిలర్ కావ్య శ్రీరాములు, బి.రవికాంత్‌రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

## గ్రీన్‌హిల్స్‌కాలనీలో మహిళా దినోత్సవం



ప్రజాపక్షం/సరూర్‌నగర్: నేటి మహిళా అన్ని రంగాల్లో రాణిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తుందని అభ్యుదయ మహిళా మండలి అసోసియేషన్ అధ్యక్షురాలు టి.పుష్పలతారెడ్డి అన్నారు. ఆర్‌కెపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పలతారెడ్డి మాట్లాడుతూ సృష్టికి మూలమే మహిళా అని, మహిళ లేనిదే మానవ మనుగడ లేదన్నారు. ఆసోసియేషన్ చైర్మన్ చామల శైలజా రెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ తరుపున పేదలకు చేయుతను ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరి డాక్టర్ అర్చనారెడ్డి, కోశాధికారి కృష్ణవేణి, ఉపాధ్యక్షులు జి.గీతారెడ్డి, పి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో బిసిలకు రూ.31వేల కోట్ల నిధులివ్వాలి : ఆళ్ల



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : రాష్ట్ర బడ్జెట్ 2025–26లో బిసిలకు రూ.31వేల కోట్లు నిధులు కేటాయించాలని నేషనల్ ఒబిసి ఇంటెలెక్చువల్ ఫోరం జాతీయ అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీన్ని బట్టి ఎట్టిపరిస్థితుల్లో బడ్జెట్‌లో బిసిల వాటా 27శాతం తగ్గకుండా చూడాలని కోరారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకారం విద్య,వైద్యానికి బడ్జెట్ కేటాయింపులు జరగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కులగణన ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించడం హర్షణీయమని, ఇందుకు సిఎం రేవంత్‌రెడ్డికి, పిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బిల్లును 9షెడ్యూల్‌లో చేర్చేలా అన్ని రాజకీయ పార్టీలు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఇండస్ట్రియల్ పార్క్ భూసేకరణపై స్టేటస్‌కో ఎత్తివేతకు హైకోర్టు నిరాకరణ




ప్రజాపక్షం/హైదరాబాద్ : వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట్‌లో కొందరు రైతుల భూమిని సేకరణ చేయరాదని గతంలో సింగిల్ జడ్జి జారీ చేసిన స్టే ఉత్తర్వులను రద్దు చేసేందుకు డివిజన్ బెంచ్ నిరాకరించింది. స్టే ఉత్తర్వులను ఎత్తివేయాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్లను డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. స్టే ఎత్తివేయాలని ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. భూ సేకరణ ప్రక్రియ యథాతథస్థితి (స్టేటస్‌కో) ఉత్తర్వులను కొనసాగించాలని స్పష్టం చేసింది. ఈ వ్యాజ్యాన్ని సత్వరమే విచారణ పూర్తి చేయాలని సింగిల్ జడ్జిని డివిజన్ బెంచ్ ఆదేశించింది. రెండు అప్పీళ్లను తిరిగి సింగిల్ జడ్జి వద్దకు పంపింది. లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, తదితర గ్రామాల్లో భూ సేకరణ జరిపి మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లో 1177.35 ఎకరాలు సేకరించేలా 2024, నవంబర్ 29న ప్రాథమిక నోటిఫికేషన్ వెలువరించింది. ఇందులో 534 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. మిగిలిన 643 ఎకరాలు పట్టా భూమి. లగచర్లలో 110.32 ఎకరాలు, హకీంపేట్‌లో 351.10 ఎకరాలు సేకరిస్తామని ప్రకటించింది. భూసేకరణ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ హకీంపేట్‌కు చెందిన కె.శివకుమార్ మరొకరు పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పిటిషనర్ల భూ సేకరణపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసింది. అప్పీల్ పిటిషన్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకా యారా ధర్మాసనం సోమవారం విచారించింది. ఏజీ వాదిస్తూ, ఇప్పటికే భూ సేకరణ చాలా వరకు జరిగిందని, స్టే ఉత్తర్వుల కారణంగా ఆ ప్రక్రియ జాప్యం అవుతోందన్నారు. ఇలాంటి సమయంలో స్టే ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు కోసం ప్రభుత్వం ఏర్పాట్లు కూడా చేస్తున్నదని తెలిపారు. వాదనల తర్వాత హైకోర్టు, పిటిషనర్లకు చెందిన సుమారు 8 ఎకరాల భూమిని సేకరణపై యథాతథస్థితి (స్టేటస్ కో) ఉత్తర్వులు కొనసాగించాలంది. స్టే ఉత్తర్వులను రద్దు చేయబోమని తేల్చి చెప్పింది. ఈ వివాదాన్ని సింగిల్ జడ్జి వద్దనే తేల్చుకోవాలని వెల్లడించింది. అప్పీల్‌ను సింగిల్ జడ్జి వద్ద పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

### ప్రభుత్వ భూమి ఆక్రమణలపై వివరణ ఇవ్వండి

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మునుగునూరులో ప్రభుత్వ భూమి రక్షణకు తీసుకునే చర్యలను వివరించాలని రాష్ట్రానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వ భూమి ఆక్రమణలపై ఫిర్యాదు చేసినప్పటికీ అధికారుల నుంచి చర్యలు శూన్యమని పేర్కొంటూ సరూర్‌నగర్‌కు చెందిన సీహెచ్ ప్రశాంత్ వేసిన పిల్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన ధర్మాసనం విచారించింది. సర్వే నెం.90పిలోని రూ.50 వేల కోట్ల విలువ చేసే 6.28 ఎకరాల భూమిని కొందరు ఆక్రమించుకోవడంతో పాటు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, దీనిపై ఫిర్యాదు చేసినా అధికారుల చర్యలు తీసుకోవడం లేదని పిల్‌లో పేర్కొన్నారు. ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి, జిల్లా కలెక్టర్, కొంగరకలాన్ ఆర్‌డిఒ, ఇబ్రహీంపట్నం తహసీల్దార్, విద్యుత్తు శాఖ ఇఇ, డిఇ, ఎఇ, తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది.

## ఐసిఎఐ ఉపాధ్యక్షుడిగా ప్రసన్నకుమార్




ప్రజాపక్షం/ఖైరతాబాద్ : ఇన్సిట్యూట్ ఆఫ్ చార్టెట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) ఉపాధ్యక్షుడిగా సిఎప్రసన్నకుమార్ ఎన్నిక పట్ల సంస్థ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వారు ప్రసన్నకుమార్‌ను ఘనంగా సన్మానించారు. తన వృత్తి నైపుణ్యాల ద్వారా ప్రసన్నకుమార్ ఎంతోమందికి మార్గదర్శకంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో సిఎ కోట అమృత్‌కుమార్, సిఎ సాంబశివరావు, సిఎ ప్రణీత్, సిఎ గెల్లి నరేశ్, గోనుగుంట మురళి, ఎఫ్ఎఐ, అవోపా జాతీయ అధ్యక్షులు సి.ఎ.బెల్డి శ్రీధర్‌తో పాటు ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.

## పది పరీక్షలకు జిల్లాలో 249 పరీక్ష కేంద్రాలు

పకడ్బందీగా ఏర్పాట్లు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: జిల్లాలో 249 పరీక్ష కేంద్రాలలో 51,766 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నందున పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ఈనెల 21 నుండి జరుగనున్న పదవ తరగతి పరీక్షల నిర్వహణకు చేపట్టవలసిన అన్ని ఏర్పాట్లపై మంగళవారం విద్యాశాఖతో పాటు సంబంధిత ఇతర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ 21 నుండి ప్రారంభం అయ్యే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లను విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాలలో అన్ని వసతులతో కూడిన ఏర్పాటు చేయాలని, ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి సెంటర్‌లో ఎఎన్ఎంలను అందుబాటులో ఉండే లా ఏర్పాటు చేయాలని తెలిపారు. టిఎస్ ఆర్‌టిసి అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి సకాలంలో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే విధంగా బస్సులు నడిచే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్‌శాఖ తమ పరిధిలోని సెంటరలలో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండే విధంగా చూడాలన్నారు. ఆర్డీవోలు, ఎంఆర్ఒలు, ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్‌లు పరీక్ష కేంద్రాలలో సౌకర్యాలను పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు తాగునీరు, తగిన ఫర్నీచర్ కేంద్రాలలో ఉండే విధంగా తనిఖీలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు రాకుండా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## రైతుల సంక్షేమమే లక్ష్యం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



ప్రజాపక్షం/షాబాద్ : రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని జిల్లా గ్రంథాలయ చైర్మెన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ సహకార సంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షతన సింగిల్ విండొ చైర్మెన్ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సీఈఒ శివకుమార్ రెడ్డి సభ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మెన్ మధుసుదన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన పంట రుణాలు రూ. 3కోట్లా 14లక్షలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంకే దక్కుతుందన్నారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి సుమారుగా 20.64 మెట్రిక్ టన్నుల ఎరువులను అందజేసిన్నట్లు తెలిపారు. షాబాద్ మండలంలో రైతు సహాకార సంఘం తరపున రైతులకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. సింగిల్ విండొ చైర్మెన్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు సంఘం సభ్యత్వం, కొత్తగా రైతులకు ధీర్ఘకాలీక రూణాలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు నేరుగా సహాకార సంఘం అధికారులను కలిసి సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్దర్‌నగర్ మార్కెట్ చైర్మెన్ పీసరి సురేందర్ రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశం, వైజ్ చైర్మెన్ మద్దుర్ మల్లేష్, డైరెక్టర్లు నర్సింలు, గోపాల్ రెడ్డి, రాజరత్నం నర్సింలు గౌడ్, సహాకార సంఘం సభ్యులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## బిసి బిల్లు ఆమోదంపై షాద్‌నగర్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ప్రజాపక్షం/షాద్‌నగర్: తెలంగాణ శాసనసభలో బిసి రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం లభించడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ బిల్లుకు శాసన సభలో ఏకగ్రీవ తీర్మాణం లభించడం సంతోషించదగ్గ విషయమన్నారు. సర్పంచ్ నుండి మేయర్ స్థాయి వరకు, విద్య, ఉద్యోగాల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అమోదించడం అభినందనీయమన్నారు. పార్లమెంట్‌లో సైతం అమోదం లభిస్తుందని తాము ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు వివరించారు. బిసి సేనా జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల ప్రశాంత్ ముదిరాజ్, ఆసెంబ్లీ అధ్యక్షుడు కత్తీ చంద్రశేఖర్ అప్ప, మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, కార్యదర్శులు నరేష్, చందులాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానించడంతోపాటు స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, రాజు, కృష్ణారెడ్డి, వీరేశ్, జంగ నర్సింలు యాదవ్, పట్టణ అధ్యక్షుడు కె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



## సాహెబ్‌నగర్ కలాన్‌లో రిజిస్ట్రేషన్ సమస్యకు విముక్తి

బిఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : సాహెబ్ నగర్ కలాన్ సర్వే నెంబర్ 201/1లో రిజిస్ట్రేషన్ సమస్యకు విముక్తి యధావిధిగా రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి ఫారెస్టు అధికారులు ఎన్‌ఓసి ఉందించారని, కాలనీ వాసులు ఎవరు అపోహలు పడవద్దని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. మంగళవారం ఫారెస్ట రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఫారెస్టు అధికారి సుధాకర్‌రెడ్డి వారి కార్యాలయంలో కాలనీ వాసులతో కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి సాహెబ్ నగర్ కలాన్ సర్వే నెంబర్ 201/1లో రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నుంచి సబ్ రిజిస్ట్రర్ ఆఫీస్‌లకు నోటీసులు రావడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీంతో సంబంధిత అధికారులకు సమస్యను వివరించడంతో జిల్లా ఫారెస్ట్ అధికారి, రేంజ్ అధికారిని తెలియచేయడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఫారెస్టు అధికారులు ఎన్‌ఓసి సర్టిఫికెట్ జారీ చేయడంతో ప్రజలకు యధావిధంగా రిజిస్ట్రేషన్లు అమలు అయ్యే విధంగా సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాలు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పురుషోత్తంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, రఘురాంనేత, శ్రీధర్ రావు, ధనరాజ్, రమణ, విష్ణువర్ధన్‌రెడ్డి, కాంతరావు, ప్రబాకర్, కృష్ణారావు, నవీన్, వికాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత చరిత్రాత్మక విజయం



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం చరిత్రాత్మక విజయమని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సభ్యున్నతి కోసం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. బడుగు బలహీనవర్గాల ప్రజలకు న్యాయం చేయాలనే సంకల్పంతో సహ సోపేతమైన నిర్ణయం తీసుకోవడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు షాద్‌నగన్ నియోజకవర్గం తరపున ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం

నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంబంధిత బ్యాంకుల ద్వారా రూ.50వేల నుండి నాలుగు లక్షల వరకు రుణాలు ఇప్పించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, రాజు, హరినాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జంగ నర్సింహ్మా, వీరేశం, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ దామోదర్ రెడ్డి, ఓబిసి చైర్మన్ చంద్రశేఖర్, నేతలు బాల్‌రాజ్ గౌడ్, రఘు నాయక్, బస్వం, పురుషోత్తంరెడ్డి, అనసూయ, నుశ్రత్ భేగం, సయ్యద్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

### యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్‌ను అభినందించిన ఎమ్మెల్యే

ఫరూఖ్‌నగర్: యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ముదిరాజ్ జన్మదిన సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ఆయనను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సత్కరించారు. గ్రామీణ స్థాయి నుండి యువజన కాంగ్రెస్‌ను పటిష్టం చేసేందుకు అందె మోహన్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, సింగిల్‌విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : ఎల్‌బినగర్ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదయ్యింది. హస్తినాపురం డివిజన కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్‌పై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఎల్‌బినగర్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టారు. సుధీర్‌రెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసి ఆరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. సుధీర్‌రెడ్డిపై కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ డిసిపి, ఎసిపి, సిఐలకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేత మధుయాష్కీ, హస్తినాపురం కార్పొరేటర్‌లపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే సుధీర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎల్‌బి నగర్ పోలీసులు తెలిపారు.

### ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి మహిళా కమిషన్ సమన్లు

హైదరాబాద్: ఎస్‌టి మహిళా కార్పొరేటర్ సుజాత నాయక్‌పై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి మహిళా కమిషన్ మంగళవారం సమన్లు జారీచేసింది. సుజాత నాయక్ ఫిర్యాదుపై మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ కార్పొరేటర్లు. జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డితో కలిసి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ళ శారదను బాధితురాలు సుజాత కలిశారు. తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారదకు వినిపించారు. ఈమేరకు కమిషన్ ముందు హాజరు కావాలంటూ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి మహిళా కమిషన్ సమన్లు జారీచేసింది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న మహిళా కార్పొరేటర్‌పై ఒక ఎమ్మెల్యే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అంటే మహిళా లోకాన్ని అగౌరవ పరచడమే అంటూ మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

### ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలపై మధుయాష్కీ గౌడ్ ఆగ్రహం

ఎల్‌బి నగర్: సోదరి హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్‌పై మాట్లాడిన తీరు అత్యంత దారుణమని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై కాంగ్రెస్‌నేత మధుయాష్కీగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఆయన వీడియో సందేశం పంపారు. ఎమ్మెల్యే మాట్లాడిన తీరుపై తీవ్రమైన చర్యలు ఉంటాయని. పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. 'కెటిఆర్.. కవిత'.. గిరిజన మహిళ కార్పొరేటర్‌పై మీ ఎమ్మెల్యే మాట్లాడింది..మీకు వినిపించలేదా? కనిపించలేదా? మీకు ఏమాత్రం జ్ఞానం ఉన్నా ఎమ్మెల్యేని బర్తరఫ్ చేసి, సుజాత నాయక్ కాళ్లు మొక్కించి క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు.

## మందుల డీలర్లకు శిక్షణ తరగతులు

**ప్రజాపక్షం/పూడూర్ :** పరిగి నియోజకవర్గంలోని పూడూర్ మండల పరిధిలోని పురుగు మందులు అమ్మే డీలర్లకు వచ్చే వానకాలంలో సన్నద్ధం చేయడంలో భాగంగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి హాజీరై మాట్లాడుత రైతులకు నాణ్యమైన విత్తనాలు ,పురుగు మందులు, ఎరువులు సరఫరా చేయాలని అని అదేశించారు. ఈ కార్యక్రమంలో సహయ సంచాలకులు లక్ష్మి , వ్యవసాయ అదికారిలు డీలర్స్ తదితరులు పాల్గోన్నారు.

# మహానగరి

## అదుపులోకి పేకాట రాయుళ్లు



**ప్రజాపక్షం/పరిగి :** పరిగి పట్టణంలోని ముబారక్ వెల్డింగ్ షాపు వెనుకల ఐదుగురు వ్యక్తులు డబ్బులు పెట్టి పేకాట అడుతున్నారని నమ్మదగ సమాచారం రాగ పరిగి ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తన సిబ్బందితో వెళ్లి చూడగా పేకాట అడుతున్న వారిని పట్టుకోని వరి వద్ద నుండి రూ 9320 స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేయడమైనది అని ఎస్‌ఐ తెలిపారు.

## తాగునీరు వృథా.. పట్టించుకోని అధికారులు



**ప్రజాపక్షం/ఆల్వాల్ :** రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొన్ని ప్రాంతాలలో తాగునీరు సరఫరా సరిగ్గా లేక నానా అవస్థలు పడుతున్నారు. భూగర్భ జలాలను అడుగంటి పోవడంతో నీటి ఎద్దడి ఏర్పడింది. బోర్లలో కూడా నీరు రావడం లేదు దాంతో ఇతర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకునే పరిస్థితి నెలకొంది. అయితే దీనికి భిన్నంగా అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం డివిజన్ కొంపల్లి రోడ్డులో తాగునీరు వృధా అవుతున్న పట్టించుకునే అధికారులు కరువయ్యారు. అధికారుల నిర్లక్ష్యంతో నీరు రోడ్డు పాలవుతుంది. డివిజన్లోని పలు కాలనీలో మంచినీటి సౌకర్యం రాకపోవడంతో అధికారులకుఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రోడ్లను సైతం వదలని కబ్జాకోరులు

రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణం



**ప్రజాపక్షం/దుండిగల్ :** అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ భూములు హారతి కర్పూరంలా కరిగి పోతున్నాయి. ప్రభుత్వ భూమైనా, ప్రజాప్రయోజన స్థలమైన కబ్జాదారులు వదలడం లేదు. రహదారులను సైతం ఆక్రమించి అక్రమనిర్మాణాలు చేపడుతున్నారంటే కబ్జాదారుల తీరు ఏపాటిదో ఇట్టే అర్థమవుతుంది. దుండిగల్ మండల పరిధిలోని సర్వే నంబర్ 120 డాక్టర్ బస్తి వీకర్ సెక్షన్ కాలనీలో రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడితే స్థానికుల ఫిర్యాదు మేరకు గతంలో కూల్చివేశారు. కూల్చిన చోటే రాత్రికి రాత్రి రెండు రూములు, ఒక ప్రహారీ గోడ నిర్మించిన రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడడంలేదు. కాసులకు కక్కుర్తి పడుతున్న రెవెన్యూ అధికారులు పరోక్షంగా కబ్జాదారులు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో రెవెన్యూ అధికారులు నిర్మాణాలను పూర్తిగా నేలమట్టం చేశారు. కూల్చిన చోట రాత్రికి రాత్రి నిర్మాణాలు చేపడుతున్న విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెల్లామని పట్టించుకోవడంలేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతోనే గత ఐదు నెలల నుండి అక్రమనిర్మాణాలు జోరుగా సాగుతున్నాయంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.

## వికారాబాద్ డిపోకు 16 బస్సులు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర శాసన సభపతి ,వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ కృషితో వికారాబాద్ బస్ డిపోకు నూతనంగా 16బస్సులు కేటాయించడం జరిగింది . రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ప్రయాణంలో టిజిఆర్‌టిసి బస్సులలో రద్దీ పెరిగిన నేపథ్యంలో వికారాబాద్ బస్‌డిపోకు మరిన్ని కొత్త బస్సులను కేటాయించాలని రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను స్పీకర్ కోరడంతో 16బస్సులను మంజూరు చేసినట్లు స్పీకర్ తెలిపారు.

## 'పది' విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లు అందజేత



**ప్రజాపక్షం /కొడంగల్ :** రానున్న పది పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు కొడంగల్ మున్సిపల్ మాజీ చైర్మెన్ జగదీశ్వర్‌రెడ్డి అల్ ది బెస్ట్ చెబుతు ఉచితంగా ఎగ్జామ్ ప్యాడ్‌లను అందజేశారు. మంగళవారం కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని రావులపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పది పరీక్షలను శ్రద్దతో, క్రమశిక్షణతో వ్రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. పరీక్షలలో ఉత్తీర్ణత శాతాన్ని పెంపోందించాలని కొడంగల్‌కు మంచి పేరు తీసుకువచ్చి మీ బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ రాజేష్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మెన్ పట్నం అంబయ్యగౌడ్, పిఎసిఎస్ చైర్మెన్ కట్కం శివకుమార్‌గుప్త, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మురారీ వశిష్ట, వెంకటయ్య(మాఫి)లతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులున్నారు.

# ఎస్‌సి, ఎస్‌టిలను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

షెడ్యూలు కులాల జాతీయ కమిషన్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ఎస్‌సి, ఎస్‌టిలకు సబ్సిడీ రుణాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆశించిన విధంగా లేదని షెడ్యూలు కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచదర్ తీవ్రంగా మండి పడ్డారు. గత 46 మాసాలుగా ఎస్‌సి, ఎస్‌టిలకు అందించాల్సిన సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం మంజూరు చేయక పోవటం వల్ల లబ్ధిదారులు తమ సిబిల్ స్కోరు కోల్పోవటం, నాన్ పర్ఫామెన్స్ అకౌంట్ లాంటి సమస్యల నెదుర్కొంటూ భవిష్యత్తులో కొత్త రుణాలు పొందలేని ప్రమాదంలో పడుతున్నారన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే లబ్ధిదారుల సబ్సిడీలను సకాలంలో మంజూరు చేయాలని సూచించారు. అణగారిన వర్గాల కోసం ప్రధాన మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటూ పలు పథకాలను అమలు చేస్తూ భారీగా నిధులు కేటాయిస్తోందని, ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఎస్‌సి, ఎస్‌టిలకు ఏ మేరకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందన్న అంశంపై కలెక్టర్ గౌతంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల ఉన్నతాధికారులతో జాతీయ కమిషన్ డైరెక్టర్ జి.సునీల్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలకు భూ సమస్యల పరిష్కారం, ఉపాధి అవకాశాల అంశాలలో తలెత్తుతున్న లోపాలను పరిశీలించిన తగు విధంగా చర్యలు తీసుకొనే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల కేసులను పోలీసు విభాగం సక్రమంగా జాప్యం లేకుండా పరిష్కరిస్తున్నారా లేదా అన్న విషయంపై ఆరా తీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను ఉపయోగించుకుని ఎస్‌సి, ఎస్‌టి అణగారిన వర్గాలు తమ జీవనగతులను మెరుగుపరచుకోవాలని జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ సూచించారు. అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఆర్థిక ప్రయోజనం పొంది ముందుకు వెళ్లే విధంగా జిల్లా యంత్రాంగం అవగాహన కల్పించటం ద్వారా ప్రోత్సహించాలని ఆయన అధికారులను ఆదేశించారు.. షెడ్యూల్ కులాలకు రాజ్యాంగ పరంగా ఉన్న హక్కుల పరిరక్షణ చట్టం, నిరాదరణకు గురైన సందర్భాల్లో అనుసరించాల్సిన విధి విధానాలు, బాధిత కుటుంబీకులకు సత్వర న్యాయం కోసం రూపొందించిన చట్టాల అమలు తీరును ఆయన వివిధ జిల్లా ప్రభుత్వ కార్యాలయాల వారీగా కమిషన్ సభ్యులు సమీక్షించారు. మహిళలకు ప్రభుత్వం ఎక్కువ సబ్సిడీ రుణాల గురించి ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు అవగాహన కల్పిస్తూ పారదర్శకత పాటిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. లబ్ధిదారులకు క్రమం తప్పకుండా రుణాలందించేందుకు లీడ్ బ్యాంకు మేనేజర్లు చర్యలు తీసుకోవాలని, అట్రాసిటి కేసుల్లో కుల ధృవీకరణ సర్టిఫికెట్లను జారీ చేయటంలో ఎలాంటి జాప్యం తగదని, అదే విధం గా ఈ కేసుల్లో బాధితులకు ప్రభుత్వ పరంగా అందించే ఆర్థిక సయాన్ని సమయానికి అందించాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా యంత్రాంగం అందిస్తున్న లబ్ధిదారుల విషయాలను కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కమిషన్ సభ్యులకు వివరించారు. మల్కాజిగిరి, మేడ్చల్ డిసిపిలు పద్మజ, కోటిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తదితలు ఈసమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

**ప్రజాపక్షం/తాండూరు :** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తాండూరులోని వినాయక కన్వేషన్ హల్‌లో తాండూరు డిఎస్‌పి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యాన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్. జయ ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి ల సహకారంతో సైబర్ నేరాల పట్ల ప్రజల అవగాహన కోసం జిల్లా ఎస్‌ప నారాయణరెడ్డి చేతుల మీదుగా పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని, చైతన్యపర్చాడానికే పోస్టర్‌ను విడదుల చేశారమని తెలిపారు. పట్టణ పరిసర ప్రాంతాలలో పాటు గ్రామీణ ప్రాంతాలలో ఈ పోస్టర్‌లను అతికించి ప్రజలకు చైతన్యవంతులను చేయడమే తమ ధ్యేయమన న్నారు. ఈ కార్యక్రమంలో టౌన్, సంతోష్‌కుమార్, రూరల్ సిఐలు నగేష్, వైద్యులు సంతోష్, శివ మోహన్ రెడ్డి తదితరులు పాల్గోన్నారు.



## బిసిలకు42% కోటా అభినందనీయం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** బిసి బిల్లును అమలు చేసిన సందర్భంగా మల్కాజిగిరి బార్ అసోసియేషన్ మంగళవారం కేక్ కట్ చేసి అభినందన సభ నిర్వహించింది.బిసిలకు 42 శాతం విద్యా ఉద్యోగ రాజకీయాల్లో ప్రాతినిధ్యం కల్పిస్తామని, దీని కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, కేంద్ర ప్రభుత్వం ద్వారా సైతం దీన్ని అమలు చేసే బాధ్యత తీసుకొంటామని ప్రభుత్వాధినేతలు పేర్కొనటం హర్షణీయమన్నారు. రాష్ట్రం నుండి కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించటంలో అన్ని పార్టీలను ఒప్పించి ఆమోదించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీకాంత్, ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నం దేవరాజ్, గౌడ్, తురక రత్నయ్య, కె.వాసు, సునీత రాజు, స్వాతి, సుధీర్ బాబు, మన్మోహన్, జాహ్నవి, పలువురు న్యాయవాదులు ఈ సంబరాల్లో పాల్గొన్నారు.

## ఘనంగా పెంచల్ రెడ్డి వర్ధంతి



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ వ్యవస్థాపకులు యలమూరి పెంచల్ రెడ్డి 28వ వర్ధంతి వేడుకలు మంగళవారం భగత్ సింగ్ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీ.లక్ష్మారెడ్డి పాల్గొని స్థానిక నాయకులతో కలిసి యలమూరి పెంచల్ రెడ్డి, షహీద్ భగత్ సింగ్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళ్ళులర్పించా రు. అనంతరం ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీ.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పెంచల్ రెడ్డి త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వై.జనార్ధన్ రెడ్డి, వై.నర్సింహ రెడ్డి, డి.కృష్ణమూర్తి, మజ్జారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చే వరకూ పోరాటం

**ప్రజాపక్షం/తాండూరు :** ఆశవర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆద్వర్యాన మంగళవారం తాండూరు తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన చేశారు. ఆశవర్కర్స్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలలోనే ఆశవర్కర్లకు ఇచ్చిన హామీలకు చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు రేణుకా, అరుణ, రమాదేవి, ఆశవర్కర్స్ అనంతమ్మ, రాములమ్మ అరుణ తదితరులు ఉన్నారు.

## సొంత నిధులతో పవర్ బోరు మరమ్మతు పనులు

మల్కాజిగిరి కార్పొరేటర్ సునీతా

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గౌతంనగర్ డివిజన్‌లోని అన్ని కాలనీలలో వేసవి కాలం దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా తాను సొంత నిధులతో పవర్ బోరు మరమ్మత్తు పనులు జరిపిస్తానని స్థానిక కార్పొరేటర్ సునీతా రాము యాదవ్ తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని ఇందిరానెహ్రూనగర్, ఈస్ట్ ఇందిరా నెహూగర్ తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. గత కొంత కాలంగా పవర్ బోర్లకు సంబంధించి నీటి వాల్వులు పాడవటం వల్ల నీటి సరఫరా ఇబ్బందిగా ఉన్నందున తానే మరమ్మత్తు చేయిస్తానని కాలనీవాసులకు తెలిపారు.

## విఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి కళాశాలలో ముగిసిన సిన్టిలేషన్జ్ వేడుకలు

సాంప్రదాయ దుస్తులతో, నృత్యాలు చేస్తూ ఆకర్షణగా నిలిచిన విద్యార్థులు



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి విఎన్‌ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సిన్టిలేషన్జ్ 25 కార్యక్రమం ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ వార్షిక సాంస్కృతికోత్సవం కార్యక్రమంలో థ్రీయరీ బ్యాండ్ తమ సంగీత కార్యక్రమంతో ఆహుతులను విశేషంగా అలరించారు. కళాశాల విద్యార్థులు సాయి వల్లభ (తెలుగు ఇండియన్ ఐడల్ పోటీదారు), సాహితి అడపా (స్టార్ మా సూపర్ సింగర్ ఫైనలిస్ట్), హారికా సాయిమణి (పాడుతా తీయగా పోటీదారు) లు తమ గానాలతో వేల మంది ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సాంస్కృతికోత్సవంలో భాగంగా వోగ్ వోయాజ్ పేరిట ఫ్యాషన్ వాక్ నిర్వహించారు. కళాశాలకి చెందిన శాస్త్రీయ నృత్య విద్యార్థి కూటమి నృత్య తరంగ్ సభ్యులు తమ నాట్యంతో ప్రేక్షకులను ఆనందాన్ని కలిగించగా హైదరాబాద్ హాప్ కన్వెన్షన్ పేరిట నిర్వహించిన హిప్ హాప్ డాన్స్ పోటీలో సిబిఐటి కళాశాలకి చెందిన విద్యార్థి కూటమి గెలుపొందినట్టు నిర్వాహకులు తెలిపారు. అదేవిదంగా సాంప్రదాయ వస్త్రాలంకరణతో విద్యార్థినీ విద్యార్థులు కళాశాల ప్రాంగణమంతా కలియతిరుగుతూ సందడి చేశారు. కేరళ బ్యాండ్ సభ్యులు తమ సంప్రదాయ సంగీతంతో మరింత ఆకట్టుకున్నారు. విద్యార్థులందరూ రంగురంగుల దుస్తుల్లో క్యాంపస్‌కి కొత్త కళను తీసుకువచ్చారు. సాంస్కృతికోత్సవంలో భాగంగా అధ్యాపకుల కోసం కళాశాల సంగీత కూటమి క్రెసెండో నిర్వహించిన అంత్యాక్షరి పోటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన జటు గెలుపొందారు.

# పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

పరీక్షా కేంద్రంలోనికి సెల్‌ఫోన్ అనుమతించకూడదు

జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లాలో ఉన్న తాహసీల్దార్, ఎంపిడిఒలు, ఎంఇఒలు, పరీక్షలకు సంబంధించిన అన్ని శాఖ అధికారులతో కలెక్టర్ దృష్యా మధ్యం ద్వారా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా బాలురు 6450, బాలికలు 6453 , మొత్తం 12903 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలను రాస్తున్నారని తెలిపారు. పరీక్ష నిర్వహిణకు జిల్లా వ్యాప్తంగా 69 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడమైనన్నారు. పరీక్ష కేంద్రల నిర్వహణ, పరీశీలనకు 20మంది ఎంపిడిఒలు, 20 మంది తహసీల్దార్లను 20మంది ఎంఇఒలను 732మంది ఇన్విజిలేటర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంను ముందగానే తెలుసుకోవాలని , పరీక్ష కేంద్రనికి ఒక గంట ముందుగానే రావాలని సూచించారు. పరీక్ష ఉదయం 9.30 నిమిషాలకు ప్రారంభం అవుతుంది కావున అలస్యంగా వచ్చిన విద్యార్థులకు ఐదు నిమిషాలు సమయం ఇవ్వబడుతుందన్నారు. పరీక్ష కేంద్రంలో ఉన్న ఏవ్యక్తికైన సెల్‌ఫోన్ ఉండడానికి వీలు లేదని, ఎఎన్‌ఎం దగ్గర కుడ సెల్ ఫోన్ ఉండడానికి వీలు లేదన్నారు. పరీక్ష కేంద్రం సిబ్బంది స్క్వాడ్స్ తప్ప వేరే ఎవ్వరు ఉండకుడదని ,విద్యార్థులను తప్పకుండా పరీక్షించాలని అదేశించారు. పరీక్ష కేంద్రల వద్ద తాగునీరు , విద్యుత్ సరఫరా అన్ని ఏర్పాటు చేసుకోవలని అన్నారు. పరీక్షలు మార్చి 21నుండి ఎప్రిల్ 3వరకు కోనసాగుతయని అన్నారు. పరీక్ష కేంద్రల ఎలాంటి అవంచనీయ సంఘటనలు జరిగిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్ , సుధీర్, విద్యాశాఖ అధికారి రేణుకాదేవి పాల్గోన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్న జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగింది, ఫోన్‌నెంబర్ 08416235245కు కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోగాలరని తెలిపారు.

# మేడిగడ్డ కుంగుబాటుకు కెసిఆర్ బాధ్యుడనే ఫిర్యాదును పరిష్కరించండి

భూపాలపల్లి జిల్లా కోర్టును ఆదేశించిన హైకోర్టు



**హైదరాబాద్ :** మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగుబాటు ఘటనకు నాటి సిఎం కెసిఆర్, నాటి ఇరిగేషన్ మంత్రి టి.హరీష్‌రావులను బాధ్యులను చేయాలంటూ భూపాలపల్లి జిల్లా కోర్టులోని కేసులో వెలువడిన నోటీసులను హైకోర్టు రద్దు చేసింది. కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీశ్ రావు సవాలు చేసిన పిటిషన్లను జస్టిస్ కె.లక్ష్మ ణ్ విచారణ పూర్తి చేసి మంగళవారం తుది ఉత్తర్వులను వెలువరించారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగడానికి నాసిరకమైన నిర్మాణంతో పాటు సరైన డిజైన్ లేకపోవడమే కారణమంటూ భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తి భూపాలపల్లి లోయర్ కోర్టులో క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని లోయర్ కోర్టు కొట్టివేయడంతో జిల్లా కోర్టులో ఆయన క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. రాజలింగమూర్తి పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన జిల్లా కోర్టు కెసిఆర్, హరీశ్‌రావుతో కలిపి ఆరుగురికి నోటీసులను జారీ చేసింది. భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ కెసిఆర్, హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జిల్లా కోర్టు తన పరిధి లేకున్నా పిటిషన్‌ను విచారణకు స్వీకరించిందని, ఇలా చేయడం సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు వ్యతిరేకమని కెసి ఆర్ తరఫు లాయర్లు గతంలో వాదించారు. గతంలోనే హైకోర్టు, జిల్లా కోర్టు ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసింది. మంగళవారం తీర్పు వెలువరిస్తూ, పిటిషన్లను అనుమతిచ్చింది. కింది కోర్టులో ఫిర్యాదుదారు రాజలింగమూర్తి ఇటీవల హత్యకు గురైన విషయం తెలిసిందే. మేడిగడ్డ బ్యారేజీ వల్ల రూ.1.30 లక్షల కోట్ల ప్రజాధనం వెచ్చించడం జరిగిందని, ప్రధానమైన మేడిగడ్డ రిజర్వాయర్ కుంగుబాటు వల్ల రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందని ప్రభుత్వ వాదన. మేజిస్ట్రేట్ కోర్టు ఫిర్యాదును కొట్టేస్తూ వెలువరించిందని, దీనిపై అసాధారణ పరిస్థితులు ఉంటేనే జిల్లా కోర్టు విచారణకు అనుమతించాలని, అలాంటి పరిస్థితులు ఏమీ లేవని, జిల్లా కోర్టు నోటీసులు చెల్లవని కెసిఆర్, హరీశ్‌ల న్యాయవాది వాదన. ఇరుపక్షాల వాదనల తర్వాత గతంలో తీర్పును వాయిదా వేసిన హైకోర్టు, మంగళవారం తీర్పు వెలువరిస్తూ, ఈ వ్యవహారంపై కింది కోర్టు చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. కేసీఆర్, హరీశ్‌లకు జిల్లా కోర్టు ఇచ్చిన నోటీసులను రద్దు చేసింది.

## మేడిగడ్డలో డ్రోన్ ఎగురవేత కేసులో తీర్పు వాయిదా

కెటిఆర్ ఇతరుల పిటిషన్‌పై ముగిసిన వాదనలు

**హైదరాబాద్ :** మేడిగడ్డ బ్యారేజీ ప్రాంతంలో డ్రోన్ ఎగురవేశారంటూ మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకట రమణారెడ్డి, బాల్క సుమన్‌లపై పోలీసులు నమోదు చేసిన కేసును సవాల్ చేసిన పిటిషన్లపై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. ఇరుపక్షాల వాదనలు మంగళవారం పూర్తికావడంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని జస్టిస్ కె.లక్ష్మ ణ్ ప్రకటించారు. మేడిగడ్డ నిషేధిత ప్రాంతంగా కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ, మేడిగడ్డ ప్రాజెక్టు ప్రాంతంపై డ్రోన్స్ ఎగురవేయకుండా నోటిఫికేషన్ వెలువరించాలని కేంద్రాన్ని కోరామని చెప్పారు. కేంద్రం నోటిఫికేషన్ ఇవ్వకుండా, మేము కోరామని చెబితే ఎలాగని హైకోర్టు ప్రశ్నించింది. మేడిగడ్డ సందర్శన సందర్భంగా అనుమతులేకుండా డ్రోన్ వినియోగించారని 2024 జులై 20న మహదేవపూర్ పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలంటూ కెటిఆర్, గండ్ర, సుమన్ పిటిషన్ వేశారు. పిటిషనర్లు ప్రాజెక్టును సందర్శించిన మూడు రోజులకు పోలీసులు కేసు నమోదు చేశారని, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వలీషేక్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసును కొట్టేయాలని వాళ్ల న్యాయవాది వాదించారు. గత ఏడాది జులై 26న సందర్శించగా అదే రోజు కాకుండా జులై 29న కేసు నమోదు చేశారని వివరించారు. అధికారిక రహస్యాల చట్టం కింద నిషేధిత జాబితా ప్రాంతంగా చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వాలని చట్టం స్పష్టం చేస్తోందన్నారు. మేడిగడ్డ రిజర్వాయరులో తగినంత నీరు ఉన్నప్పటికీ విడుదల చేయకపోవడంపై కేటీఆర్ తదితరులు సందర్శించిన మాట వాస్తవమేనన్నారు. మేడిగడ్డ రిజర్వాయర్ పిల్లర్లు కుంగుబాటుకు గురయ్యాయని, అక్కడ డ్రోన్స్ ఎగురవేస్తే ప్రమాదమని, అందుకే అది నిషేధిత ప్రాంతంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెప్పారు. నిషేధిత జాబితాలో చేర్చుతూ కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్ ఏదని హైకోర్టు ప్రశ్నించింది. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు తీర్పును వాయిదా వేసింది.

## బౌరంపేట్ భూములకు కన్జర్వేషన్ జోన్ తీసివేయాలి

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వినతి



**ప్రజాపక్షం/దుండిగల్ :** బౌరంపేట్‌లో భూములకు కన్జర్వేషన్ జోన్ తీసివేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు డా॥ ఎస్. మల్లారెడ్డి దుండిగల్ మున్సిపల్ అధ్యక్షులు పిసరి కృష్ణారెడ్డి అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, 2012 సంవత్సరంలో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జోన్ లు ఏర్పాటు చేయడం జరిగిందనీ అప్పుడు రైతులకు వ్యతిరేకంగా జోన్ల నిర్ధారణ చేయడం జరిగిందని, కాబట్టి రైతులకు అనుకూలంగా జోన్లు ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా కెసిఆర్ 10 ఏండ్ల పాలనలో కేవ లం డబ్బులు దండుకోవడం తప్ప ఈ సమస్యకు ఎలాంటి పరిష్కారం చూపకుండా ముగిసిందని, రైతుల పొలాల పక్కనే ఉన్న జోన్‌లో లేని బడా సంస్థలు పెద్ద పెద్ద హై రైస్ అపార్ట్మెం ట్లు నిర్మిస్తుంటే కంజర్వేషన్ జోన్ రైతులు వాటిని చూసి బిత్తరపోవాల్సిన పరిస్థితి ఉంది. అమ్ముకుంటే ధర రాక భవన నిర్మాణాలకు అనుమతులు రాక ప్రభుత్వం నుండి పరిహారం రాక ఆవేదన చెందుతున్నరన్నారు. కంజర్వేషన్ జోన్ తీసేయడానికి అప్లికేషన్లు ఇవ్వమని చిన్న పిలుపు ఇస్తే ఒకే రోజు 160 కి పైగా అప్లికేషన్లు రావడం జరిగింది ఇంకా చాలా మంది వీలు లేక అందుబాటులో లేక ఇవ్వాల్సిన వరున్నారు. ప్రస్తుత రేవంత్ రెడ్డి సర్కార్ కూడా మేడ్చల్ జిల్లా పరిధిలో అన్ని గ్రామాలలో రైతులకు రుణ మాఫీ చేయకుండా కనీసం రైతు భరోసా ఇవ్వకుండా రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. ఎందుకివ్వరంటే మేడ్చల్ జిల్లా కమర్శియల్ ప్రైమ్ ల్యాండ్ అంట ఇవ్వాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభు త్వ తీరు, అప్పట్లో మేడ్చల్ రూరల్ గ్రామ పంచాయతీలుగా ఉండేది బిఆర్‌ఎస్ హయాంలో మున్సిపాలిటీలు చేసి అన్యాయం చేసింద్రు అంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మున్సిపాలిటీలు కూడా సరైన అభివృద్ధికి నోచుకోక ముందే జిహెచ్ఎంసిలో విలీనం చేసి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. కావున మేడ్చల్ జిల్లా గ్రేటర్‌లో కలిస్తే జిల్లాలో పట్టణీకరణ విస్తరిస్తుంది కూరగాయలు ఆకు కూరలు పండించే రైతులకు జీవనోపాధి దొరుకుతుంది పట్టణీకరణ చెందితే మేడ్చల్ జిల్లా రైతులు ఎవరు వ్యవసాయం చేయకూడదని, రైతులు, బిజెపి తరపున డిమాండ్ చేశారు. వెంటనే రైతు రుణమాఫీ చేయండి, రైతు భరోసా ఇవ్వండి బౌరంపేట్ సహా అన్ని గ్రామాలు ఆర్ 1 జోన్‌లోకి మార్చండని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గోనె మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.విగ్నేశ్వర్, నల్ల రామచంద్రరెడ్డి, ఏ.మల్లేష్ యాదవ్, సర్గారి సత్తిరెడ్డి, మాజీ ఎంపీటీసీ జంగారెడ్డి, డి.ప్రభాకర్ రెడ్డి, ఎం.జంగారెడ్డి, వై.శ్రీనివాస్ రెడ్డి, గ్రామ ప్రజలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

